క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


క్రీడాకారుడు పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఫార్మసీ కళాశాల విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌శెట్టి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన కబడ్డీ ఎంపిక పోటీల్లో తమ కళాశాలకు చెందిన పవన్‌కుమార్ అత్యంత ప్రతిభ చాటారన్నారు. రాష్ట్రస్థాయిలో పోటీల్లో ప్రతిభ చాటి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే క్రీడాకారుడిని కళాశాల చెర్మన్ శాంతిరాముడు, ఎండీ శివరాం తదితరులు అభినందించారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు


సి.బెళగల్‌లో వేడుకలు జరుపుకుంటున్న ఎంఈఓ జ్యోతి, హెచ్‌ఎంలు

సి.బెళగల్: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ జ్యోతి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పాఠశాలలకు ఈనెల 24వ తేదీన ఐచ్ఛిక సెలవు, 25న క్రిస్మస్ పండుగ సెలవు, 26న కొన్ని పాఠశాలలకు స్థానిక సెలవు (లోకల్ హాలీడే) ఉండటంతో ముందస్తు క్రిస్మస్ వేడుకలను జరుపుకుంటున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హెచ్‌ఎంలు కిషోర్‌కుమార్, నాగేశ్వరరావు, సోమశేఖర్ తదితరులు ఉన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం వేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం కోడుమూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నామని, ముఖ్య అతిథులుగా కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ వస్తున్నట్లు ఆయన తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం


ప్రకృతి వ్యవసాయ కూరగాయలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ధాన్యాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని కోడుమూరు ఎంపీడీఓ రాముడు పేర్కొన్నారు. సోమవారం కోడుమూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పొదుపు సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఆయన సందర్శించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులు, మందులు ఉపయోగించి పండించే కూరగాయలను తినడం వల్ల మనుషులు అనేక రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రజలంతా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులనే తినాలని, తద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీడీఓ సూచించారు.

హాకీ విజేత గార్గేయపురం


విజేత గార్గేయపురం బాలికల హాకీ జట్టు

కర్నూలు (టౌన్): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని రెండు రోజులుగా స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న క్రిస్మస్ కప్ హాకీ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. బాలికల ఫైనల్ మ్యాచ్‌లో మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టుపై 3 – 0 స్కోర్‌తో గార్గేయపురం జట్టు గెలిచింది. అలాగే బాలుర విభాగంలో గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టుపై 1-0 స్కోర్‌తో మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు విజయం సాధించింది. బహుమతుల కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ కార్యదర్శి జయాకర్, ప్రవీణ్, హాకీ కార్యదర్శి దాసరి సుధీర్ విజేతలుగా నిలిచిన జట్లకు మెడల్స్, కప్పును అందజేశారు. విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్ రంగస్వామి విజేతలకు రూ.5 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు.

గ్రీవెన్స్ తుస్స్...


కోడుమూరులో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం మండల అధికారులకు పట్టడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమో లేక అధికారుల నిర్లక్ష్యమో తెలియడం లేదు గానీ పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి ఒకరిద్దరు అధికారులు మినహా మిగతా వారెవ్వరూ హాజరు కావడం లేదు. ఒకవేళ వచ్చినా ఏదో మొక్కుబడిగా సంతకాలు చేసి వెళ్లడం తప్ప ఏమి చేయడం లేదన్న విమర్శలున్నాయి. సోమవారం కోడుమూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి ఎంపీడీఓ రాముడు, ఏఈ, ఐసీడీసీఎస్ సూపర్‌వైజర్ తప్ప మిగిలిన అధికారులెవ్వరూ హాజరు కాలేదు. కార్యక్రమానికి అధికారులే డుమ్మా కొడుతుంటే ఇక తమ సమస్యలను ఏం పరిష్కరిస్తారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అంతులేని నిర్లక్ష్యం


సి.బెళగల్‌లో పీజీఆర్‌ఎస్‌కు హాజరైన ముగ్గురు అధికారులు

సి.బెళగల్: మండల అధికారులు ప్రజా సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారంపై ఆసక్తి కనబరచడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇందుకు అధికారులు ప్రవర్తించే తీరే నిదర్శనంగా నిలుస్తోంది. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించారు. అయితే పలువురు మండల అధికారులు గైర్హాజరయ్యారు. కేవలం తహసీల్దార్, ఏఓ మల్లేష్‌కుమార్, మండల సర్వేయర్ నాగభూషణం మాత్రమే కార్యక్రమం మొదలవగానే హాజరయ్యారు. మండల వైద్యాధికారులు, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, పీఆర్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, వెలుగు, ఉపాధిహామీ, పశువైద్యులు, విద్యాశాఖ అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా పీజీఆర్‌ఎస్‌కు హాజరు కాలేదని తహసీల్దార్ చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజానీకం కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి కొత్త భవనం మంజూరు చేయాలని స్థానిక నాయకులు ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు. సోమవారం గ్రామానికి చెందిన విజయుడు, శంషుద్దీన్ ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ముస్లిం వీధిలో 3 విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరడంతో వర్షం వస్తే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతోంది. దెబ్బతిన్న స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బస్టాండ్ సెంటర్‌లో ఉన్న మ్యాన్‌హోల్‌పై ఇనుప గ్రిల్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలోని 6 సామూహిక మరుగు దొడ్లు శిథిలావస్థలో ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. ఇవేగాక మరికొన్ని సమస్యలను వివరించి పరిష్కరించాలని విన్నవించారు.

తగలబెడితే చేటే!


కొరటమద్ది సమీపంలో వరి పంట వ్యర్థాలను తగలబెట్టిన దృశ్యం

- పొలాల్లో పంట వ్యర్థాలకు నిప్పు పెడుతున్న రైతులు
- లాభం కన్నా నష్టమే ఎక్కువని చెబుతున్న అధికారులు
- వాతావరణ కాలుష్యంతో పాటు పచ్చదనం కనుమరుగవుతుందని ఆందోళన
- వ్యర్థాలను కుళ్లబెడితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని సూచన

గడివేముల: వరి కోతలు పూర్తయ్యాక పొలాల్లో మిగిలిన వ్యర్థాలకు రైతులు నిప్పు పెడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇది ఒక్కోసారి ప్రమాదాలకు దారితీస్తోంది కూడా. యంత్రాల పుణ్యమా అని వరి కోతలు త్వరగా పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని రాశులుగా పొలాలు, గట్లపై నిల్వ చేస్తున్నారు. కొంతమంది రైతులు అవగాహన రాహిత్యంతో పొలాల్లో మిగిలిన గడ్డి వ్యర్థాలకు నిప్పు పెడుతుండడం పరిసర రైతులకు శాపంగా మారింది. ఒక పొలంలో పెట్టిన నిప్పు సమీప పొలాలకు వ్యాపిస్తుండడంతో ఆ పొలాలు, చేల గట్టుపై నిల్వ చేసిన ధాన్యం రాశులకు నిప్పు ఎక్కడ అంటుకుంటుందోనని సర్వత్రా ఆందోళన నెలకొంటోంది. ఇలాంటి ఘటనల సమయంలో ఉరుకులు, పరుగులతో ధాన్యపు రాశులను నీటితో తడుపుకుంటున్నారు.

తరచూ ప్రమాదాలు..

ముఖ్యంగా వరి కోతలు ప్రారంభమయ్యాయి. పొలంలోని వ్యర్థాలకు రైతులు నిప్పు పెడుతున్నారు. దీంతో సమీపంలోని పచ్చటి పొలాలు సెగకు కాలిపోయి రైతులకు నష్టం జరిగే అవకాశం ఉంది. అలాగే పశువులకు మేత దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. గడివేముల మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 7 వేల ఎకరాల్లో వరి పంట పండించారు. కోతలు పూర్తయ్యాయి. చేలల్లో మిగిలిన గడ్డికి రైతులు నిప్పు పెడుతుండడంతో భారీగా పొగ ఆవరించి ఆ వేడికి స్థానిక నివాసాల వారు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అలాగే శ్వాసకోశ సమస్యలు ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పచ్చదనం కనుమరుగు

కొందరి అనాలోచిత చర్యలతో పంటపొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల గట్లపై ఉన్న పచ్చని మొక్కలూ దహనమవుతున్నాయి. దీంతో విలువైన మొక్కలు బుగ్గిపాలవుతున్నాయి. ఏటా మొక్కలు నాటుతున్నా సంరక్షణ లేక కొన్ని చనిపోతున్నాయి. మంటలతో మరికొన్ని మొక్కలు కాలిపోవడంతో పచ్చదనం కనుమరుగవుతోంది. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా అలాగే నేలలో కుళ్లబెడితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మిత్ర పురుగులు నాశనం



పంట పొలాల్లో కోతల అనంతరం గడ్డి వ్యర్థాలను తగ్గలబెట్టడం వల్ల అపకారం చేసే సూక్ష్మజీవులతో పాటు మేలు చేసే మిత్ర పురుగులూ నాశనం అవుతాయి. కోతలు కోసిన తరువాత గడ్డిని వెదజల్లి నీరు పెట్టడం వల్ల గడ్డి మొత్తం కుళ్లిపోయి పొలానికి మంచి సేంద్రియ ఎరువుగా మారుతుంది. పంట పొలాల్లో మిగిలిన గడ్డి వ్యర్థాలను తగ్గలబెట్టవద్దు.

– హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

బీడీ కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి


కర్నూలు ఆర్డీఓ కిడారి సందీప్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు

కర్నూలు(రూరల్): బీడీ కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని జొహరాపురం 19వ వార్డు బీడీ వర్కర్స్ కాలనీవాసులు, ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ హుస్సేన్, సెక్రటరీ ఎస్.యం.డీ.షరీఫ్ తదితరులు సోమవారం కర్నూలు ఆర్డీఓ కిడారి సందీప్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీకి చెందిన 817 మంది ఇంటిపట్టాల కోసం ఎళ్లతరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వారికి ఇప్పటికైనా ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఇళ్ల పట్టాలు మంజూరైతే నిర్మాణానికి లోన్, ఇతర సంక్షేమ పథకాలకు అర్హులవుతారని తెలిపారు. ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేయకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు దీక్ష చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ దేశాయ్, మహబూబ్ బాషా, అబ్దుల్ నయీం, నబీ తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన ఉండాలని దంత వైద్యుల సంఘం రాయలసీమ బ్రాంచ్ సెక్రటరీ డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి అన్నారు. జాతీయ దంత వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించారు. స్థానిక ఎన్‌ఆర్ పేటలోని శ్రీలక్ష్మి స్కూల్‌లో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించడంతో పాటు దంత సంరక్షణ పట్ల అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఉడికీ ఉడకని ఆహారం, జంక్‌ఫుడ్ పదార్థాలు పంటిపై ఉండిపోయి ఎనామిల్‌ను పాడు చేస్తాయని, దీన్ని నివారించేందుకు రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలన్నారు. ఆహారం తిన్న తర్వాత మౌత్‌వాష్ చేసుకోవడం ద్వారా నోటి దుర్వాసన సమస్యను అరికట్టవచ్చన్నారు. సీడీహెచ్ కన్వీనర్ డాక్టర్ నౌషాద్, సీడీఈ కన్వీనర్ మజర్, పశుపతి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


ట్రాన్స్‌ఫార్మర్ పక్కన స్తంభానికి అల్లుకున్న చెట్ల తీగలు

పాణ్యం: మండల పరిధిలోని అహల్యాపురం గ్రామంలోని సమ్మర్ స్టోరేజీ వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంపచెట్లు, విద్యుత్ వైర్ల వెంట చెట్ల తీగలు, ఆకులు అల్లుకొని ప్రమాదానికి సంకేతంగా మారింది. మరో వైపు ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న దిమ్మె ఒరిగి ఉండడంతో ఎప్పుడు కిందపడుతుందనే భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపక్కనే ఉండడంతో ప్రజలు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన కంపచెట్లు, ఒరిగిన దిమ్మె, అల్లుకున్న చెట్ల తీగలు నిర్వహణ లోపాన్ని ఎత్తి చూపుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోకులం షెడ్లను పూర్తి చేయండి


సి.బెళగల్‌లో ఉపాధిహామీ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఏపీడీ అల్లిపీర

సి.బెళగల్: మండలంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఏపీడీ అల్లిపీర సూచించారు. ఆయన సోమవారం మండలంలోని పోలకల్, సి.బెళగల్, కంబదహాల్ గ్రామాల్లో పర్యటించి, గోకులం షెడ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొని మండల ఉపాధిహామీ ఏపీఓ రామన్న, జేఈ రంగస్వామి, టీఏలు, ఎఫ్‌ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు పథకంపై అవగాహన కల్పించి వెంటనే నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. సమీక్షలో టీఏలు మురళీ, రామ్‌శంకర్, గోవర్ధన్, రాజశేఖర్, ఉమా, సీఓ సుధాకర్ తదితరులు ఉన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సుజాతమ్మ

కల్లూరు: వ్యవసాయ శాస్త్రవేతలు సూచించిన సస్యరక్షణ చర్యలను చేపట్టడం ద్వారా రైతులు పంటలసాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఎరువాక కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుజాతమ్మ అన్నారు. సోమవారం కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో ఏరువాక కేంద్రం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల అనంతపురం వారి ఆధ్వర్యంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి డాట్ సెంటర్ శాస్త్రవేత్త సుజాతమ్మ, అనంతపురం వ్యవసాయ కళాశాల డీన్ రవీంద్రనాథ్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీన్ రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యత, సమగ్ర వ్యవసాయ యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. సూక్ష్మ నీటి యాజమాన్య పద్ధతుల ద్వారా వ్యవసాయ, ఉద్యాన పంటలు ముఖ్యంగా కూరగాయ పంటలను తక్కువ నీటితో పండించవచ్చునన్నారు. విద్యుత్ అందుబాటులో లేని ప్రాంతాల్లో సోలార్ సూర్యరశ్మి ఉపయోగించుకొని పంటలకు నీటి తడులు ఇవ్వవచ్చని వివరించారు. యువ రైతులకు వ్యవసాయ యాప్స్ గురించి అవగాహన కల్పించారు. సుజాతమ్మ మాట్లాడుతూ.. పత్తిలో స్వల్పకాలిక రకాలను ఉపయోగించి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. డిసెంబర్ నాటికి పత్తి కోతలను పూర్తి చేయాలని, అలాగే గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించుకోవాలన్నారు. శనగ పంటలో విత్తనశుద్ధి అవశ్యకతను, గంధకం మూలకం ప్రాముఖ్యతను వివరించారు. మొక్కజొన్న, జొన్నలో కత్తెర పురుగు యాజమాన్య పద్ధతులను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవికిషోర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సోమసుందర్, ఎంపీటీసీ మునిస్వామి, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త


నందనపల్లె గ్రామ సచివాలయం సమీపంలో రోడ్డు పక్కన వేసిన చెత్తచెదారం

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని నందనపల్లె గ్రామ సచివాలయం సమీపాన కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి పక్కనే చెత్త వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పెద్దఎత్తున చెత్త పేరుకుపోవడంతో అటువైపు ప్రయాణం చేసే వారు ముక్కు ముసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డు పక్కన చెత్త వేయడంతో అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉంది. గ్రామ పంచాయతీలో చెత్త తరలించే వాహనాలు లేకపోవడంతో సమీప కాలనీవాసులు ఇళ్లలోని చెత్తచెదారం తీసుకొచ్చి రోడ్డు పక్కనే వేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే కాలనీవాసులు రోడ్డు పక్కన చెత్త వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికలను సంరక్షించాలి


మాట్లాడుతున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): ఆడపిల్లలు జన్మించడం అదృష్టంగా భావించాలని, వారిని మగపిల్లలతో సమానంగా పెంచాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి సూచించారు. సోమవారం ఇందిరమ్మ హౌసెస్ యూపీహెచ్‌సీ పరిధిలోని పెద్దపాడు గ్రామంలో దామోదరం సంజీవయ్య స్మారక బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ×బాలికలను రక్షించండి–బాలికలను చదివించండి× కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌమార దశలోని ఆడపిల్లలకు వివాహం చేయడం వల్ల వారు చిన్న వయస్సులో గర్భం దాల్చి తీవ్ర అనారోగ్యానికి గురౌతారన్నారు. విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనతకు గురౌతారని, ఏకాగ్రత లోపించడం వల్ల చదువులో వెనుకబడతారని చెప్పారు. ప్రతి గురువారం పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇచ్చే ఐరన్ ఫోలిక్ మాత్రలు భోజనం తర్వాత మింగాలని సూచించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెడ్‌మాస్టర్ హరిత, తదితరులు ఉన్నారు.

సామాజిక బాధ్యత కలిగి ఉండాలి


పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: యువత సామాజిక బాధ్యత కలిగి ఉండాలని రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. సోమవారం మాదక ద్రవ్యాల నివారణకు సంబంధించి వర్సిటీలో విద్యార్థులకు వ్యాసరచన, లఘుచిత్రాలు, ఇన్‌స్టాగామ్ రీల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలను పరిశీలించిన వీసీ మాట్లాడుతూ.. వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించామన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, ర్యాగింగ్, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హరిప్రసాద్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పర్యటన వాయిదా

పాణ్యం: గుంటూరు, గుంతకల్ రైల్వే లైన్‌లో చేపడుతున్న డబుల్‌ట్రాక్ పనులను పరిశీలించేందుకు డీఆర్‌ఎం విజయ్‌కుమార్‌తో పాటు పైస్థాయి అధికారులు వస్తున్నారనే సమాచారంతో సోమవారం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాణ్యం రైల్వేస్టేషన్ పరిశీలన ఉంటుందని సమాచారం అందడంతో పనులు చక చక సాగాయి. అయితే మధ్యాహ్నం 2గంటల సమయంలో అధికారులు రావడం లేదని సమాచారం అందింది. పాణ్యంలో నూతనంగా రైల్వేస్టేషన్, డబుల్ ట్రాక్ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. అయితే అధికారుల పరిశీలన ఎప్పుడనే విషయం ఇంకా వెల్లడించ లేదని రైల్వే అధికారులు తెలిపారు.

రేషన్ డీలర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

సి.బెళగల్: మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ పంపిణీ డీలర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన సోమవారం ప్రకటన జారీ చేస్తూ, మండలంలో ఆరు రేషన్ షాప్‌ల డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీలు, అర్హతల వివరాలను తెలియజేశారు. మండల పరిధిలోని కృష్ణదొడ్డి గ్రామంలోని 12వ షాపు ఓసీ (ఈడబ్ల్యూఎస్ –మహిళ), పోలకల్ 17వ షాపు (ఓసీ మహిళ), 19వ షాపు (బీసీ – ఈ మహిళ), కొండాపురంలోని 34వ షాపు (ఓసీ మహిళ), కె.సింగవరంలోని 37వ షాపు (ఓసీ- ఎక్స్ సర్వీస్ – ఓపెన్), గుండ్రేవుల గ్రామంలోని 41వ షాపు (ఎస్సీ ఓపెన్) అభ్యర్థులకు కేటాయించినట్లు చెప్పారు. ఇందుకోసం స్థానిక గ్రామ పంచాయతీకి చెంది, ఇంటర్ చదివి, 18 నుంచి 40 సంవత్సరాలలోపు వయస్సున్న వారు అర్హులని తహసీల్దార్ తెలిపారు. దరఖాస్తులను ఈనెల 30వ తేదీ సాయంకాలం 5 గంటల్లోపు కర్నూలు రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్‌డీఓ) కార్యాలయానికి చేరేలా రిజిస్టర్ పోస్టు లేదా స్వయంగానైనా అభ్యర్థులు అందజేయవచ్చని ఆయన తెలియజేశారు. పూర్తి వివరాలకు మండల తహసీల్దార్ వారి కార్యాలయం లేదా, గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) లను సంప్రదించాలని తహసీల్దార్ సూచించారు.

టెర్రస్ గార్డెనింగ్‌కు పురస్కారం


పురస్కారం అందుకుంటున్న ఎల్లప్ప

కర్నూలు(అగ్రికల్చర్): ఆర్గానిక్ టెర్రస్ గార్డెనింగ్‌లో విశేషంగా రాణిస్తున్న గుజరాతీ ఎల్లప్ప, సుష్మ దంపతులకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక పురస్కారం లభించింది. ఈ దంపతులు స్థానిక లక్ష్మీనగర్‌లో ఇంటిపై కప్పుపై దాదాపు 650 చదరపు అడుగుల విస్తీర్ణంలో 50కిపైగా రకాలతో 250 మొక్కలతో మిద్దెతోటను ఏర్పాటు చేసుకున్నారు. ఎలాంటి కెమికల్స్ వాడకుండా పూర్తిగా పశువుల ఎరువులు, చెరువుమట్టి, వర్మీకంపోస్టు, కిచెన్ వ్యర్థాలను వినియోగిస్తూ నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఉత్పత్తి చేస్తున్నారు. అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు, పూలు, ఔషధ మొక్కలతో పాటు మిద్దెపైనే జామ, అంజూర, స్టార్‌ఫ్రూట్స్, మల్బరీ, అరటి వంటి పండ్ల చెట్లను కూడా పెంచారు. పనికి రాని ప్లాస్టిక్ డబ్బాలు, ఖాళీ సంచులు, డ్రమ్ములు తదితర వాటిని మొక్కలు నాటేందుకు వినియోగిస్తున్నారు. మూడేళ్లుగా కుటుంబానికి అవసరమైన కూరగాయలను ఇంటిపైనే పండించుకుంటున్నారు. మిద్దెతోటలో విశేషంగా రాణిస్తున్న ఎల్లప్ప, సుష్మా దంపతులకు రైతునేస్తం అవార్డు లభించింది. సోమవారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, ప్రముఖ మిద్దెతోటల నిపుణులు తుమ్మేటి రఘోత్తమరావు నుంచి వారు అవార్డు అందుకున్నారు.

రోడ్డు ఛిద్రం.. ప్రయాణం నరకం


ఛిద్రమైన గడివేముల–పెసరవాయి రోడ్డు

గడివేముల: మండలంలోని కొన్ని గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలమయంగా మారిన రోడ్లలో ప్రయాణం చేసేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని పెసరవాయి గ్రామానికి వెళ్లే రహదారిలో.. ఆత్మకూరు వద్ద నిర్మిస్తున్న రోడ్డు కోసం కంకరను తరలిస్తున్న భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో అత్యవసర సమయాల్లో 108, అంబులెన్స్ తదితర వాహనాలు వెళ్లాలంటే నానా అవస్థలు ఎదురవుతున్నాయి. వర్షాలు కురిస్తే గోతుల్లో నీరు చేరిన వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రోడ్డును బాగుచేయించాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.